కమ్మేసిన పొగ మంచు



రోడ్డు కనిపించకుండ కమ్మేసిన మంచు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ లో ఆదివారం పొగ మంచు దట్టంగా కమ్మేసింది. ఉదయం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు పొగ మంచు దట్టంగా కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వాహనాలకు లైట్లు వేసుకొని ముందుకు కదిలారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పొగ మంచు స్థానికంగా నెలకొంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఉదయం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా తాను తన కార్యాలయంలో ఉదయం సమయంలో గంట సేపు ప్రజలను కలుసుకుంటున్నానన్నారు. ఈనెల 28 నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుంటుందని అర్హులైన వారు దీనికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు.

ఈ దుర్వాసన ఇంకెన్నాళ్లు..?

- పాఠశాల పక్కనే డంపింగ్ యార్డు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- డంపింగ్ యార్డు తొలగించాలని స్థానికుల డిమాండ్

మియాపూర్: మక్తమహబూబ్‌పేట్‌లో ప్రభుత్వ పాఠశాల సమీపంలో డంపింగ్ యార్డు ఉండడంతో స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల వెనక భాగంలో 100,101 సర్వే నెంబర్‌లోని ఖాళీ స్థలంలో జీహెచ్‌ఎంసీ డంపింగ్ యార్డు ఉంది. ఇక్కడికి నియోజకవర్గంలోని కాలనీ, బస్తీలలో చెత్తను ఆటోలు, లారీలలో ఇక్కడికి తరలిస్తారు. ఇక్కడ నుంచి జవహర్‌నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఇలా చెత్తను తరలించడంలో అలసత్వం వహించడం, ఎప్పటికప్పుడు చెత్తను తరలించకపోవడంతో మక్తమహబూబ్‌పేట్ సమీపంలో ఉన్న యార్డులో చెత్త పేరుకుపోయింది. ఓ వైపు దీప్తీశ్రీనగర్ ధర్మపురి ఆలయం రోడ్డు వరకు, మరో వైపు మక్తమహబూబ్‌పేట్ పాఠశాల సమీపం వరకు చెత్త గుట్టలు పేరుకుపోతోంది. వర్షాకాలంలో వర్షాలు పడి చెత్త అంతా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పాఠశాల ముందు, పక్క నుంచి వందలాది చెత్త వాహనాలు డంపింగ్ యార్డుకు వెళ్తుంటాయి.



మక్తమహబూబ్‌పేట్‌లోని పాఠశాల పక్కన బురదమయంగా మారిన దృశ్యం

వర్షాకాలంలో మరీ దారుణం..

- వర్షాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ము, ధూళీతో పాటు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఒక్కొక్కసారి డంపింగ్ యార్డు నుంచి పాఠశాల ఆవరణ వరకు ఆటోలు నిలిపిపోవడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసనతో పిల్లలు కొన్ని సందర్భాల్లో వాంతులు, వీరేచనాలు చేసుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.
- ఈగలు, దోమలు ఎక్కువగా ఉండడంతో అనారోగ్య పాలవుతున్నారని పిల్లలను తల్లి దండ్రులు సరిగా స్కూల్‌కు పంపించేందుకు ఇష్టపడడం లేదు.
- ముఖ్యంగా చిన్న పిల్లల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, వర్షాకాలంలో వర్షాలు పడుతుండడం వల్ల సమస్య మరింత తీవ్రంగా ఉందని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాల ముందు నుంచి వెళ్తున్న చెత్త వాహనాలు

అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి..

దీప్తీశ్రీనగర్, మక్తమహబూబ్‌పేట్ మధ్య ఉన్న ఖాళీ స్థలంలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వల్ల కాలనీ వాసులందరికీ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోందని, ఇక్కడ నుంచి డంపింగ్ యార్డును తొలగించాలని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేసిన స్పందన లేదు. ఈ యార్డును ఇక్కడ నుంచి తొలగించి దూరంగా ఏర్పాటు చేస్తే కాలనీవాసులకు ఎంతో మేలు జరుగుతుంది.

– నరేష్, దీప్తీశ్రీనగర్

ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలి..

మక్తమబూబ్‌పేట్‌లోని పాఠశాల పక్క నుంచి వందలాది చెత్త వాహనాలు డంపింగ్ యార్డుకు వెళ్తుంటాయి. వర్షాకాలంలో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రస్తుతం భారీ వాహనాలు వెళ్తుండడంతో ఆ ప్రాంతమంతా దుమ్ము, ధూళితో నిండిపోతోంది. చెత్తను డంపింగ్ యార్డు లోపలికి తీసుకెళ్లకుండా కొందరు ఆటో డ్రైవర్లు స్కూల్ సమీపంలోని చెత్త వేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వర్షాలు పడి చెత్త అంతా కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలి.

– శ్రీకాంత్, మక్తమహబూబ్‌పేట్

జుక్కల్ ఎమ్మెల్యేకు సన్మానం

బండ్లగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ (ఆదిలాబాద్) ఎమ్మెల్యేగా విజయం సాధించిన లక్ష్మికాంతారావును ఆదివారం ఘనంగా సన్మానించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని మోపిల్ టౌన్‌షిప్‌లో సీనియర్ జర్నలిస్టు సామాజిక కార్యకర్త మేడం మధుసుధన్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే లక్ష్మికాంతారావుకు బోకే అందజేసి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెంటారెడ్డి, ఎం.రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న కల్యాణంలో హర్యానా గవర్నర్



మల్లన్న స్వామి కల్యాణోత్సవానికి వచ్చిన బండారు దత్తాత్రేయ

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మీగూడ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు అడికె రాజు నివాసంలో ఆదివారం జరిగిన మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరయ్యారు. కళ్యాణ కార్యక్రమంలో పాల్గొని పూజాలు నిర్వహించారు. అనంతరం అడికె రాజు కుటుంబ సభ్యులు దత్తాత్రేయను ఘనంగా సన్మానించారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



బాపిష్టు చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మణికొండ: క్రిస్మస్ పండగను పురస్కరించుకుని క్రిస్టియన్‌లు ఆదివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని బాపిస్టు చర్చిలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మనకు పండగలు, ఆనందాలు పంచేందుకు వస్తాయని వాటిని అందరితో కలిసి ఉత్సాహంగా జరుపుకోవాలన్నారు. క్రిస్టియన్ సోదరులందరికీ ఆయన క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పి. శైలజవినోద్, యాలాల లావణ్యనరేష్, నాయకులు సీతారాం, శ్రావణ్‌కుమార్, రాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

రాజేంద్రనగర్: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాజేంద్రనగర్ మండల స్థాయి తొలి సమావేశాన్ని ఆదివారం భవానీ కాలనీలో నిర్వహించారు. ఈ సమావేశంలో కె. రామారావు, ఎన్.ఆర్. నాగేశ్వర్‌రావు, జి. రాములు, వి. సత్తయ్య, శోభారాణి, మహ్మద్ ముస్తఫాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అసోసియేషన్ పెద్దలు బి.పరమేశ్వర్, కె.రామారావులను సన్మానించారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న భక్తులు, నాయకులు

మణికొండ: అయ్యప్ప నామస్మరణతో నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం మారు మ్రోగింది. గ్రామానికి చెందిన గురుస్వామి జెల్లి వెంకటేష్ నిర్వహించిన మహాపడి పూజకు పెద్ద ఎత్తున అయ్యప్ప మాలాధారులు, భక్తులు హాజరయ్యారు. గురుస్వామి వేదాంతము రాజసింహాచార్యులు చేతుల మీదుగా ఉదయం ప్రారంభమైన మహాపడి పూజ మధ్యాహ్నం వరకు లక్ష్మమ్మ దేవాలయం ఆవరణలో కొనసాగింది. వేద మంత్రాలతో అయ్యప్ప మహాపడిపూజ, గంగపుత్ర నర్సింగ్‌రావు భజనతో గ్రామం మారుమ్రోగింది. 18 మెట్ల మహాపడిని సన్నిదానం స్వాములు కాల్చారు. అనంతరం జెల్లి బాలమణి నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూజలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్‌తో పాటు పలువురు కౌన్సిలర్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆనందోత్సవాలతో క్రిస్మస్ జరుపుకోవాలి



క్రిస్మస్ కానుకలను అందజేస్తున్న కిరణ్‌కుమార్

మణికొండ: పండగలను ప్రతి ఒక్కరు ఆనందోత్సవాలతో జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కిరణ్‌కుమార్ అన్నారు. నార్సింగి మెథడిస్ట్ చర్చి వద్ద ఆదివారం ఆయన పేదలకు క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు ఉన్న దాంట్లో కొంత లేని పేదలకు పంచితే దేవుడు ఆశీర్వదిస్తాడన్నారు. ప్రతి సంవత్సరం తన వంతుగా కొంత మంది పేదలకు బట్టలు, పండగ సామాగ్రిని పంపిణీ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు దత్తజయంతి వేడుకలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో 26న దత్త జయంతి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఆలయంలో షిర్డీసాయిబాబాకు కాకడ హారతితో వేడుకలను ప్రారంభిస్తామన్నారు. అనంతరం 7.30 నుంచి 9 గంటల వరకు షిర్డీసాయిబాబా, వినాయకుడు, దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సాయిసు చరిత్రపారాయణం, 12 గంటలకు మధ్యాహ్న హారతి, అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం వివరించారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు పురవీధుల్లో పల్లకి ఉత్సవం, 6.15 గంటలకు షిర్డీసాయిబాబాకు సంధ్యాహారతి, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ప్రత్యేకంగా భక్తులతో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 9 గంటలకు షేజ్ హారతితో వేడుకలను ముగించడం జరుగుతుందని, ఈ వేడుకలను ఆలయ అర్చకులు వీవీవీ ఎస్‌శర్మ పర్యవేక్షిస్తారు.

చెరువులు అన్యాక్రాంతం కాకుండా చూడండి



పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ పరిధి 2వ డివిజన్‌లోని బతుకమ్మ కుంట, కొత్త చెరువులను ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్‌లోని బతుకమ్మ కుంట, కొత్త చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయని నాయకుడు పాండు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ చెరువు స్థలం 4 నుంచి 5 ఎకరాలు ఉంటుందని దీనిని ఆక్రమించుకునేందుకు కొంతరు విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజల సౌకర్యాం, ఉపయోగపడేలా చెరువు స్థలంలో చుట్టు కంచెతో పాటు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ చెరువులను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చెరువు స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తహసీల్దార్‌తో మాట్లాడి కంచెను, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నరు. ఈ సందర్భంగా ఆయన కాళీమందిర్ మెయిన్ రోడ్‌పై శానిటేషన్ స్వీపింగ్ పనులను పరిశీలించారు. రోజు రోజుకు చలి తీవ్రత పెరగడంతో తమకు షటర్స్ ఏర్పాటు చేయాలని కార్మికులు కమిషనర్‌కు విన్నవించారు. దీంతో త్వరలోనే షెటర్స్ అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఈ జి.యాదయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన నరేందర్‌ముదిరాజ్

మణికొండ: ఆసుపత్రులు, సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి గ్రామంలో గగన కంటి ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన స్థానిక కౌన్సిలర్ బి.యాదమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం తీసుకుంటున్న ఆహార లోపాల వల్ల అనేక మందికి కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. తరచూ ఇలాంటి కేంద్రాలలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ల సలహాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ కె. లక్ష్మీనారాయణ, నాయకులు మర్రి ముత్యం రెడ్డి, శశిపాల్‌సింగ్, ధర్మపురి ముదిరాజ్, రాములు, కుమ్మరి శేఖర్, అరుణ్‌కుమార్, కృష్ణ, డాక్టర్‌లు పాల్గొన్నారు. 300 మంది గ్రామస్థులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్టు అరుణ్‌ముదిరాజ్ తెలిపారు.

పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు కృషి



ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డయాబెటిస్ స్పెషలిస్ట్ డాక్టర్ రాహుల్‌గాంధీ

బండ్లగూడ: నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు తమవంతు బాధ్యతగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని డాక్టర్ రాహుల్ గాంధీగౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పీరంచెరువు వసంతిఆనంది అపార్ట్‌మెంట్‌లో ఆదివారం డయాబెటిస్ స్పెషలిస్ట్ డాక్టర్ రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రాంతాలకు చెందిన 100 మంది పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్‌గాంధీగౌడ్ మాట్లాడుతూ డయాబెటిస్‌ను డాక్టర్ల సూచనలను మందులు వాడుతూ పూర్తిగా కంట్రోల్ చేసుకోవచ్చునన్నారు. ప్రతి రోజు నడక తదితర వ్యాయామాలు చేయాలన్నారు. ప్రతి నెల లేదా మూడు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించుకోని డాక్టర్లు సూచించిన మందులు తప్పనిసరసిగా వాడాలన్నారు. డాక్టర్లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మహ్మద్ జావిద్

అత్తాపూర్: ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం ఎంఎం పహాడీలో నివసిస్తున్న మహ్మద్ జావిద్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావటంతో తరచూ కుటుంబంలో గొడవలు జరిగేవి. ఈనెల 10వ తేదీన చెప్పాపెట్టకుండా ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. పలు చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

'మనూ'లో పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ



షమీమాపర్వీన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేస్తున్నట్లు ఆదివారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగంలో షమీమాపర్వీన్ పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీని ప్రకటించారు. 'మనూ' కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్(సీటీఈ) సందర్భంగా, సహ పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోజాఫర్ ఇస్లామ్ పర్యవేక్షణలో సీటీఈ బీదర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బొందురాజు సహ పర్యవేక్షణలో ఆమె పీహెచ్‌డీని పూర్తి చేశారు. దీని కోసం 'అండర్ స్టాండింగ్ ఆఫ్ ది జియోగ్రాఫికల్ కాన్సెప్ట్స్ ఆమోద్ ది రిలేషన్ టు కాగ్నిటివ్ ఎబిలిటీస్' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

రోడ్లపై మురుగు నీరు.. పట్టించుకోని అధికారులు



డైమండ్ అపార్ట్‌మెంట్ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

అత్తాపూర్: సంవత్సర కాలంగా రోడ్లపై మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే వారు లేరని ఉప్పర్‌పల్లి డైమండ్ అపార్ట్‌మెంట్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై మురుగు పారటం, దుర్వాసన గృహాల్లోకి వస్తుండటంతో డెంగ్యూ, మలేరియా వంటి రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. అనేక సార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పైకి వెళ్లాలంటే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమస్యలను తమ దృష్టికి ఎప్పటికపుడు తేవాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని మాటలు చెప్పే అధికారులు చేతల్లో మాత్రం ఆ పనితనం కనిపించటం లేదని డైమండ్‌హిల్స్ అపార్ట్‌మెంట్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

'సీబీఐటీ'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీబీటీ) కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం కళాశాల ఆవరణలో కలుసుకుని సందడి చేశారు. కళాశాలలో చదువుకుని దేశ, విదేశాలలో స్థిరపడి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొంటారు. వారంతా తమ కళాశాల నాటి రోజులను గుర్తు చేసుకోవటంతో పాటు వారి అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనదారులకు తప్పని అవస్థలు

- అసంపూర్తిగా బీటీ రోడ్డు పనులు
- రెండేళ్లు కావచ్చినా పూర్తి కాని వైనం

శంషాబాద్ రూరల్: రెండేళ్ల కిందట ప్రారంభించిన రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దారిలో కంకర వేసి వదిలేయడంతో వాహనదారుల నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఘాంసిమియాగూడ నుంచి శంకరాపురం వరకు ఏర్పాటు చేస్తున్న బీటీ రోడ్డు పనులు ఓ అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్నట్లు కొనసాగుతున్నాయి. బెంగళూరు జాతీయ రహదారి నుంచి చెర్లగూడ వరకు ఈ రోడ్డు పనులు చేపట్టారు.



ఘాంసిమియాగూడ శివారులో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు

'పీఎంజీఎస్‌వై' నిధులతో..

ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో ఈ రోడ్డు పనులను 2021 జూలై 22న ప్రారంభించారు. రూ.2.82 కోట్లు అంచనా విలువతో పనులు చేపట్టగా.. రెండేళ్లు అయినా ఇంకా పూర్తి కావడంలేదు. ఘాంసిమియాగూడ శివారు నుంచి శంకరాపురం గ్రామం మీదుగా చెర్లగూడ వరకు రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు మట్టితో ఉండగా.. బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయి.

కంకర దారితో ఇక్కట్లు..

రోడ్డు పనుల్లో భాగంగా కంకర వేసి వదిలేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి బీటీ వేస్తే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది. ఆరు నెలలకోసారి పనులు మొదలు పెట్టి కొద్దిగా పనులు చేసి వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 3 కి.మీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డుపై వెళ్లడానికి వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. బెంగళూరు జాతీయ రహదారి నుంచి ఈ మార్గంలో శంకరాపురం, చెర్లగూడతో పాటు పీ-వన్ రోడ్డుకు చేరుకుంటారు. మార్గ మధ్యలో ప్రతిష్టాత్మకమైన ఐఎంటీ కళాశాల ఉండగా.. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.